నడిగడ్డను పైర్లతో నింపడమే ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి • జూరాల కుడి కాల్వకు నీటి విడుదల

కుడికాల్వకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండ్లతో రైతులు, అధికారులు

ధరూరు, జూలై 17 : నడిగడ్డను పచ్చని పైర్లతో నింపడమే ప్రభుత్వ లక్ష్యమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రేవులపల్లి గ్రామంలోని జూరాల ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడంతో జూరాల కుడి కాల్వ ద్వారా దిగువకు నీటి విడుదల చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల ముఖ్య అతిథిగా హాజరై కృష్ణమ్మకు పూలహారతులు సమర్పించి నాయకులతో కలిసి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగు నీటి విడుదలతో కుడి కాల్వ ఆయకట్టు కింద 36వేల ఎకరాలు సాగు అవుతుందన్నారు. రైతులు సాగు నీటిని సమన్వయంతో వినియోగించుకొని రెండు పంటలకు ఢోకా లేకుండా సాగు నీటి పద్ధతులు అవలంభించాలని తెలిపారు. అలాగే జూరాల ప్రాజెక్ట్ పార్క్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ రూ.15 కోట్ల నిధులతో చేపట్టిన పార్కు పనులు పూర్తి కావస్తున్న నేపథ్యంలో మరో పది కోట్ల రూపాయలు కేటాయించాలని సీఎంను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, పాగుంట ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నాగర్‌దొడ్డి వెంకట్ రామిరెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబురామన్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, డీవై రామన్న, విజయభాస్కర్‌రెడ్డి, డీఆర్ విజయ్‌కుమార్, రాధా కృష్ణరెడ్డి, పోలు కృష్ణారెడ్డి, ప్రభాకర్ గౌడ్, శివారెడ్డి, భగీరథ వంశీ, ఈశ్వర్, మహబూబ్, బషీర్, రాఘవేంద్రరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుర్మన్న, హనుమంతురెడ్డి, గణేశ్, నరేశ్‌గౌడ్, కృష్ణ, పవన్, ప్రాజెక్ట్ అధికారులు జుబేర్ హమ్మద్, బీచుపల్లి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతు బీమా చెక్కు అందజేత

గద్వాల, జూలై 17 : మండలంలోని సంగాలకు చెందిన రైతు రాజు మృతిచెందగా.. ప్రభుత్వం నుంచి మంజూరైన రైతు బీమా చెక్కును భార్య లలితకు, మల్దకల్ మండలంలోని మల్లెందొడికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే బండ్ల అందజేశారు.

రైతులకు అండగా నిలుస్తాం: ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఎమ్మెల్యే మేఘారెడ్డి సమక్షంలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసులుగౌడ్

వనపర్తి, జూలై 17 : వనపర్తి మార్కెట్ ద్వారా రైతులకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు.బుధవారం మండల పరిధిలోని మార్కెట్ యార్డులో నూతనంగా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాసులుగౌడ్ , డైరెక్టర్ల బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి హాజరై ఘనంగా సన్మానించారు. అంతకుముందు మార్కెట్ యార్డు కార్యాలయంలో పూజలు చేసి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాసులుగౌడ్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెకర్లను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, మార్కెట్ శాఖ సిబ్బంది ఉన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

పెబ్బేరు, జూలై 17: పెబ్బేరు పట్టణంలోని సంతబజారు కాలనీలో ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన కొమారి నర్సింహ (54) ఘటనను పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. మృతుడి భార్య గోవిందమ్మ, కుమారుడు శివకుమార్, కోడలు సుహాసిని కేసులో నిందితులుగా పేర్కొంటూ బుధవారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై హరిప్రసాదరెడ్డి తెలిపారు. శ్రీరంగాపురం మండలం నాగరాల గ్రామానికి చెందిన నర్సింహ బతుకుదెరువు కోసం కొన్నేండ్ల కిందట పెబ్బేరుకు వచ్చి స్థిరపడ్డాడు. అతడు మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరగడం, తమకు ఆధారంగా ఉన్న భూమిని విక్రయిస్తాడేమోనన్న అనుమానంతో కుటుంబ సభ్యులే ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఎస్సై తెలిపారు. ఇంట్లోనే గొడ్డలితో దాడి చేసి పారిపోగా, ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయ హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి

జాతీయ క్రీడలకు ఎంపికైన వర్షిత

వనపర్తి టౌన్, జూలై 17 : కేరళలో ఈ నెల 19 నుంచి 26 వరకు జరుగనున్న సౌత్ జోన్ సబ్ జూనియర్ హాకీ నేషనల్ టోర్నమెంట్‌కు వనపర్తి జిల్లా క్రీడాకారిణి వర్షిత ఎంపికైందని హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో మంచి ప్రదర్శనను కనబర్చి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు , హాకీ అకాడమీకి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని హాకీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మన్నెం, నిరంజన్ గౌడ్, జావేద్ ఆకాంక్షించారు.

అమరవాయి గ్రామస్తులపై ఎంపీడీవో ఫిర్యాదు

మానవపాడు, జూలై 17: ప్రజాపాలనకు సంబంధించి జీరో కరెంట్ బిల్లులు చేస్తున్న సమయంలో అమరవాయికి చెందిన కొందరు విధులకు ఆటంకం కలిగిస్తూ వ్యక్తిగత దూషణలు చేసిన వారిపై ఎంపీడీవో ఆంజనేయరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని అమరవాయిలో పంచాయతీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిని తీసి వేయాలని కొందరు గ్రామస్తులు ఎంపీడీవోను కోరారు. ఎంపీడీవో శుక్రవారమైనా శనివారం గ్రామసభ నిర్వహించి కోరం ఉంటే తప్పక తొలగిస్తామని గ్రామస్తులకు వివరించారు. అయినప్పటికీ వినని గ్రామస్తులు కార్యాలయంలో విధులకు ఆటంకం కలిగించి వ్యక్తిగత దూషనలకు పాల్పడ్డారని బుధవారం ఎంపీడీవో, సిబ్బంది పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సైని వివరణ కోరగా.. అమరవాయి గ్రామస్తులు విధులకు ఆటంకం కలిగించారని ఎంపీడీవో ఫిర్యాదు చేశారని, ఉన్నతాధికారుల ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని ఎస్సై చంద్రకాంత్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

OLD AGE HOME

★ ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం|| చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.

NT-325763-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

• జిల్లాలోని ఆలయాలకు పోటెత్తిన భక్తులు
• ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు
• అఖండ భజనలు చేసిన భజన మండళ్లు

రుక్మిణీపాండురంగస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

శ్రీరంగపురం ఆలయంలో తొలి ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

గద్వాలటౌన్, జూలై 17 : ఆషాఢశుద్ధ ఏకాదశిని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించారు. దీంతో బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నదీఅగ్రహారంలోని కృష్ణానది తీరంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అగ్రహారంలోని స్ఫటిక లింగేశ్వరస్వామి , రామాలయం, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాసంలో వచ్చే తొలిఏకాదశి రోజు ఉపవాస దీక్షలు చేస్తే ఎంతో పుణ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. అలాగే విష్ణుభక్తులు చాతుర్మాస వ్రతాన్ని చేపట్టారు. కోటలోని చెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబా, మార్కండేయ, రంగనాథస్వామి ఆలయం, వేంకటేశ్వరస్వామి, అంబాభవానీ, శివాలయాలు, ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి విష్ణుసహస్ర నామావళిని పఠించారు. అలాగే కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను భక్తులు పల్లకీపై ఊరేగించారు. అనంతరం మహామంగళ హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆలయాల్లో భక్తుల సందడి

వనపర్తి టౌన్, జూలై 17 : జిల్లాకేంద్రంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో ఏకాదశి ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. కుంకుమార్చన, అర్చన, అభిషేకాలు, కల్యాణోత్సవాన్ని ఆలయ ధర్మకర్త రఘునాథచార్యులు నిర్వహించారు. సాయంత్రం 5:30 గంటలకు లక్ష తులసీ పుష్పార్చన నిర్వహించారు.

కమనీయం.. కల్యాణం

అయిజ, జూలై 17: పట్టణంలోని అంబాభవానీ ఆలయంలో రుక్మిణీ పాండురంగ స్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ రుక్మిణి మెడలో పాండురంగ స్వామి మాంగళ్యధారణ చేశారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్‌భాస్కర్, ఆలయ కమిటీ, పండితులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి మండలంలో..

వడ్డేపల్లి, జూలై 17: శాంతినగర్‌లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రావూరి సురేశ్ ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలోని వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. స్వామివారికి అభిషేకం, సామూహిక గోవింద నామస్మరణతోపాటు ఉదయం, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, పుష్పార్చన గావించారు.

మల్దకల్ మండలంలో..

మల్దకల్, జూలై 17 : మండల కేంద్రంలోని ఆదిశిలా క్షేత్రంలో వెలిసిన లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం, సద్దలోనిపల్లిలో వెలిసిన కృష్ణస్వామి ఆలయం, పాల్వాయిలోని అడవిఆంజనేయ స్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా తిమ్మప్ప స్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు అర్చకులు మధుసూదనాచారి, రవిచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అమరచింత మండలంలో..

అమరచింత, జూలై 17 : మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం, భక్తమార్కండేయస్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా, మండలంలోని సింగంపేట ఆడవి ఆంజనేయస్వామి ఆలయం, కృష్ణంపల్లి ఆంజనేయస్వామి ఆలయం, చంద్రఘడ్ రామాలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు బుధవారం ఉపవాసాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు కుంకుమార్చన, అభిషేకాలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మదనాపురం మండలంలో..

మదనాపురం, జూలై 17 : మండలకేంద్రంలోని ఆంజనేయ స్వామి, శివాలయం, వాసవీకన్యకాపరమేశ్వరీ, రామాలయంలో ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షురాలు సరళాదేవి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రజిత్ కుమార్, కమిటీ సభ్యులు కిష్టయ్య, సాంబశివుడు, నవీన్‌కుమార్, నితిన్ కుమార్, రాములు, హరిప్రసాద్, శ్రీనివాసులు, సుచరిత, శ్రీలత, కమలమ్మ పాల్గొన్నారు.

పెద్ద మందడి మండలంలో..

పెద్దమందడి, జూలై 17: మండల కేంద్రంతోపాటు మండలంలోని చౌదరిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో గోమాత పూజను ఘనంగా నిర్వహించారు. గోమాత పూజోత్సవం, సత్యనారాయణస్వామి వ్రతం చేశారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమాల్లో అనిల్‌కుమార్‌రెడ్డి, నరేశ్‌కుమార్, పల్లె రాములు, సేనాపతి, రాఘవేందర్, రాములు, రామ్‌రెడ్డి, వెంకటేశ్, రవి, రాములు, సత్యనారాయణస్వామి, ఆంజనేయులు దంపతులు, భక్తులు, ఆలయ నిర్వాహకులు ఉన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కొత్తకోట, జూలై17 : తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం మండలంలోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పామాపురం రామలింగేశ్వర ఆలయం, కానాయపల్లి స్టేజీ సమీపంలోని దత్త కోటిలింగేశ్వర ఆలయం, పట్టణంలోని రామాలయం, అంబా భవానీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కోటిలింగేశ్వర ఆలయంలో రుద్రాభిషేకం చేశారు

ఖిల్లాఘణపురం మండలంలో..

ఖిల్లాఘణపురం, జూలై 17: మండలంలోని గట్టుకాడిపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అర్చన, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు అధికంగా రావడంతో ప్రాంగణాలు కిటకిటలాడాయి.

గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో

గోపాల్‌పేట, జూలై 17 : గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో బుధవారం తొలిఏకాదశి పర్వదినాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. భక్తులు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పండుగ సందర్భంగా బుద్ధారం గుండ్ల గట్టుపై గ్రామస్తులు సత్యనారాయణ వ్రతం నిర్వహించి వరద పాశం పోశారు.

గట్టు మండలంలో..

గట్టు, జూలై 17 : మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో తొలి ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గట్టులోని తిమ్మప్పస్వామి, గండి ఆంజనేయస్వామి, అంబాభవానీ మాత, మాచర్లలోని చెన్నకేశవ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీరంగపురం ఆలయంలో ..

పెబ్బేరు, జూలై 17 : పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లో బుధవారం తొలి ఏకాదశి వేడుకలు నిర్వహించారు. శ్రీరంగాపురంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశాల్లో కృష్ణానది నీటిని తెచ్చి అభిషేకాలు చేశారు. శ్రీరంగనాథస్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరుడు

బుద్ధారంలో స్వామిమూలవిరాట్‌ను ఊరేగిస్తున్న భక్తులు

మదనాపురం ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల పూజలు

మల్దకల్‌లో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

గట్టుకాడిపల్లిలో హోమాలు నిర్వహిస్తున్న పూజారులు

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

ఉండవెల్లి, జూలై 17: వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని బస్వాపురం గ్రామానికి చెందిన మల్లికార్జునగౌడ్ కల్లు దుకాణానికి అదే గ్రామానికి చెందిన చెట్టుకింది జయరామ్ 12తేదీన రాత్రి 7గంటలకు వచ్చి కల్లు ఉద్దెర ఇవ్వాలని కోరాడు. ఉద్దెర ఇచ్చేది లేదని మల్లికార్జున్‌గౌడ్ చెప్పడంతో రాయితో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గాయపర్చిన వ్యక్తి పై..

గోపాల్‌పేట, జూలై 17 : గాయపర్చిన వ్యక్తి పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హరిప్రసాద్ కథనం మేరకు.. గోపాల్‌పేటలోని రేగులగడ్డకాలనీకి చెందిన కోటయ్యను అదే కాలనీకి చెందిన శ్రీరాములు మంగళవారం పాతకక్షలు మనసులో పెట్టుకొని రాయితో కొట్టి గాయ పరిచాడు. దీనిపై కోటయ్య బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శ్రీరాములు పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వడ్డెరుల సంక్షేమానికి పాటుపడాలి

పెబ్బేరు, జూలై 17: వడ్డెరుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆ సంఘం జాతీయ కార్యదర్శి ఈశ్వర్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఎంబీసీ చైర్మన్ జరుపటి జైపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. వెనుకబడిన వడ్డెరలకు పలు సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని విజ్ఞప్తి చేసినట్లు ఈశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రమేశ్, బాల్‌రాం పాల్గొన్నారు.

బహుజన పోరాట యోధుడు పండుగ సాయన్న

వనపర్తి టౌన్, జూలై 17 : బహుజన పోరాటయోధుడు, పేదల గుండెచప్పుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను బుధవారం టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజారాంప్రకాశ్, గిరిరాజాచారి, నర్సింహశర్మ, ఉద్యోగ, ప్రజా సంఘాల నేతలు నాగరాజు, దేవన్ననాయుడు, బండలయ్యపాల్గొన్నారు.

ఆత్మకూరు మండలంలో..

ఆత్మకూరు, జూలై 17 : పండుగ సాయన్న జయంతి వేడుకలను పట్టణంలోని గాంధీచౌక్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, నాగరాజు, గోవర్ధన్, బుచ్చన్న, రవి, పరశురాం, లక్ష్మణ్, శ్రీను, శ్రీనివాసులు, అంజి, వెంకటన్న, విష్ణు, నాగరాజు, బాలు, చిన్ననర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌లో నివాళులర్పిస్తున్న ముదిరాజ్ నాయకులు

తెగిన విద్యుత్ తీగ.. తప్పిన ప్రమాదం

అయిజ, జూలై 17: పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి ఆలయ సమీపంలోని పెద్దవాగు వద్ద బుధవారం మధ్యాహ్నం ఓ విద్యుత్ తీగ తెగి రోడ్డుపై పడింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని వాహనాల రాకపోలను నిలిపి వేసి విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. వాహనచోదకులకు సూచనలు చేస్తూ.. అటు వైపు వాహనాలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వెంటనే రంగంలోకి దిగిన విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ సర్వోత్తమ్ విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. తెగిన తీగ స్థానంలో కొత్త తీగను అమర్చి విద్యుత్‌ను పునరుద్ధరించారు. వెంటనే స్పందించిన వైస్ చైర్మన్ నర్సింహులు, విద్యుత్ సిబ్బందికి వాహనచోదకులు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్యమిత్రుడికి ఆర్థికసాయం

పాన్‌గల్, జూలై17: మండలంలోని తెల్లరాళ్లపల్లికి చెందిన పసుపుల ఖాసీం ఇటీవల మృతి చెందాడు. కేతేపల్లి ఉన్నత పాఠశాలలో 2002-03 పదోతరగతి బ్యాచ్‌మేట్స్ ఖాసీం కుటుంబానికి రూ.61,500 నగదు, క్వింటా బియ్యం అందజేశారు. బాల్య మిత్రుడు ఖాసీం మృతి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో హుస్సేన్, రమేశ్, మాజీ సర్పంచ్ మౌలాలీ, రాముడు, వెంకటస్వామి, రాజశేఖర్, వెంకటస్వామి, రాజశేఖర్, వెంకటేశ్వరాచారి, శివశంకర్, యువరాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బావిలోపడి వ్యక్తిమృతి

ఎర్రవల్లి చౌరస్తా, జూలై 17: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తిమృతి చెందిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎర్రవల్లికి చెందిన ఉప్పరి హనుమంతు(70) రోడ్లపై కాలీసీసాలు ఏరుకుంటూ జీవనం కొనసాగిస్తుండే వాడు. 14వ తేదీన ఇంట్లో నుంచి బయటికి వెళ్లి ఇంటికి రాలేదు. బంధువుల దగ్గర ఆరాతీయాగా ఎలాంటి ఆచూకీ తెలియలేదు. బుధవారం కొట్టం కళాశాల వద్ద బావిలో బావిలో పడి మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. కొడుకు పరశురాముడు ఫిరాదు మేరకు కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని యాచకుడు మృతి

గద్వాల రూరల్, జూలై 17 : మండలంలోని జమ్మిచేడు గ్రామంలో జమ్ములమ్మ ఆలయం వద్ద పదేండ్లుగా భిక్షాటన చేస్తున్న వృద్ధుడు(70) అనారోగ్యంతో మృతి చెందాడు. వారంరోజులుగా అస్వస్థతతో బాధపడుతున్న వృద్ధుడు మూడురోజుల నుంచి ఆహారం తీసుకోకపోవడంతో పూర్తిగా నిరసించిపోయి, బుధవారం జములమ్మ ఆలయం వద్ద మృతి చెందాడు. విషయాన్ని గుర్తించిన ఆలయ జూనియర్ అసిస్టెంట్ రాజలింగం పోలీసులకు ఫిర్యాదు చేయడా ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రూరల్ ఎస్సై 8712670296, సీఐ 8712670298 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం

• వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి
• పీర్లకు దట్టీలు, మలీజా సమర్పించిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు
• ఊరేగింపు అనంతరం పీర్ల నిమజ్జనం

వనపర్తి టౌన్, జూలై 17: మత సామరస్యానికి ప్రతీక మొహర్రం అని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పీర్ల గుట్టపై ఉన్న పీర్లకు దట్టీలు, మలీజా ముద్దలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొల్ల వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ మహేశ్, కౌన్సిలర్ నారాయణ, నాయకులు సతీశ్, చీర్ల చందర్, రవి ఉన్నారు.

గట్టు మండలంలో..

గట్టు, జూలై 17 : హిందువులతోపాటు ముస్లింలు బుధవారం మొహర్రంను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పీర్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తకోట మండలంలో..

కొత్తకోట, జూలై 17 : మండలంలోని రామకృష్ణాపురం, పామాపురం, రాయినిపేట, కొత్తకోటతోపాటు వివిధ గ్రామాల్లో భక్తులు పీర్లకు మొక్కులను చెల్లించుకున్నారు. పట్టణంలోని పీర్ల వద్ద కరాటే మాస్టర్ అబ్దుల్‌నబీ ఆధ్వర్యంలో పానకం పంపిణీ చేశారు.

పాన్‌గల్ మండలంలో..

పాన్‌గల్, జూలై 17: మండలకేంద్రంతోపాటు కేతేపల్లి, రేమద్దుల, అన్నారం, బుసిరెడ్డిపల్లిలో పీర్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. బుధవారం కులమతాలకు అతీతంగా భక్తులు పీర్లకు దట్టీలు, మాలిజ సమర్పించారు.

మల్దకల్ మండలంలో..

మల్దకల్, జూలై 17 : మండలంలోని మద్దెలబండ, ఎల్కూర్, మల్దకల్, సద్దలోనిపల్లి, పాల్వాయి, తాటికుంట, విఠలాపురంలో బుధవారం మొహర్రం వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పీర్లను భాజా భజంత్రీలు, డప్పు చప్పుళ్లతో వీధుల్లో ఊరేగించారు. గ్రామంలోని ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి అలాయ్ ఆడారు. ఊరేగింపు అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువులో పీర్లను ఏటికి తరలించారు.

ఖిల్లాఘణపురం మండలంలో..

ఖిల్లాఘణపురం, జూలై 17 : మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మొహర్రం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పీర్లకు దట్టిలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉండవెల్లి మండలంలో..

ఉండవెల్లి, జూలై 17: మండలంలోని ప్రాగటూర్, కలుగోట్ల, ఉండవెల్లి, మెన్నిపాడు, పుల్లూరులో మొహర్రం వేడుకలను కులమతాలకు అతీతంగా నిర్వహించుకున్నారు. పీర్లకు దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పిల్లలు, పెద్దలు పీర్లచావిడి వద్ద అలాయ్ అడుతూ సందండి చేశారు.

గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో..

గోపాల్‌పేట, జూలై 17 : గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లోని ప్రజలు బుధవారం పీర్ల పండుగకు శక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామంలో పీర్లను ఊరేగించి సాయంత్రం నిమజ్జనం చేశారు.

చిన్నంబావి మండలంలో..

చిన్నంబావి, జూలై 17 : మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీర్లకు భక్తులు దట్టిలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పీర్లను పలు వీధుల గుండా ఊరేగింపు చేసి నిమజ్జనం చేశారు.

మదనాపురం మండలంలో..

మదనాపురం, జూలై 17 : మండలంలోని కొన్నూరు, దుప్పల్లి, అజ్జకొల్లు, తిరుమలాయపల్లి, గోపన్‌పేటలో బుధవారం మొహర్రం సందర్భంగా పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం, బొడ్డెమ్మలతో అలరించగా, యువకులు అలాయ్ బలాయ్ ఆడారు. అనంతరం పీర్లను నిమజ్జనానికి తరలించారు.

ఎర్రవల్లి మండలంలో..

ఎర్రవల్లి చౌరస్తా, జూలై 17: మండలంలోని ఆర్ గార్లపాడు, సాసనూలు, కారుపాకుల, కొండపేట, తిమ్మాపురంలో బుధవారం మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్ గార్లపాడులో మద్దెలబండ హుస్సేన్‌సాబ్ పీరును దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి కొబ్బరి కాయలు, పొట్టేళ్లు, ముడుపులు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. సాయంత్రం పానకం కుండలకు పూజలు చేసి, వీధుల్లో పీర్లసవారీ అనంతరం ఏటికి తరలించారు.

ఊరూరా పీర్ల ఊరేగింపు

అయిజ, జూలై 17: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన పీర్లకు ప్రత్యేక పూజలు చేసిన భక్తులు పురవీధుల గుండా ఊరేగించారు. సాయంత్రం పీర్లను సర్వాంగ సుందరంగా అలంకరించి ఏటికి తరలించారు. అయిజ పట్టణంలోని ఒల్లూరు పేట, కోట్లవీధి, మడ్డిగుంత కాలనీలతోపాటు భూంపురం, మేడికొండ, బైనపల్లి, ఉత్తనూర్ తదితర గ్రామాల్లో కొలువు దీరిన పీర్లు ఏటికి తరలివెళ్లాయి. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

దట్టీలు సమర్పించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

అమరచింత, జూలై 17: మొహర్రం ఉత్సవాల సందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం అర్ధరాత్రి అమరచింత పెద్దపీర్ల చావిడిలో పీర్లను దర్శించుకొని దట్టి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను పూలమాల, శాలువాతో సన్మానించారు. బుధవారం మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అమరచింత మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మతో కలిసి పెద్దపీర్లకు దట్టీని సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆత్మకూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

గద్వాల మండలంలో..

గద్వాలటౌన్/ మల్దకల్, జులై 17: మతసామరస్యానికి ప్రతీకైన మొహర్రం వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో వివిధ కాలనీల్లో కొలువైన పీర్లను పట్టణ పుర వీధుల గుండా ఊరేగించి బుధవారం రాత్రి సంగాల చెరువులో నిమజ్జనం చేశారు.

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి జిల్లాకేంద్రంలోని గంజిపేట, మల్దకల్ మండలంలోని సద్దలోనిపల్లిలో పీర్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు నాగిరెడ్డి, ప్రియాంక, మురళి తదితరులు పాల్గొన్నారు.

గద్వాల జిల్లాకేంద్రంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



అమరచింతలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఇమామ్‌లు